## శ్రీవారి సేవలో సిజెఐ జస్టిస్ చంద్రచూడ్

తిరుమల, సెప్టెంబర్ 29(ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం కుటుంబంతో కలసి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ దర్శించుకున్నారు. టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఓ లోకనాథం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## రేపు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు

### - 2.69 లక్షల లబ్ధిదారులకు రూ.113.77 కోట్లు పంపిణీ

చిత్తూరు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం 6 గంటల నుండి ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను లబ్ధిదారులకు ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీకి పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లాలో 2,69,677 మంది లబ్ధిదారులకు 113.77 కోట్ల రూపాయల మొత్తంను పెన్షన్ల రూపంలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ నెల పెన్షన్లకు సంబంధించి 1, 3 తేదీల్లో లబ్ధిదారుల ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది వచ్చి పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి సెలవు రోజు కావడంతో ఆ రోజు సామాజిక పెన్షన్ల పంపిణీ వుండదన్నారు. పెన్షన్ లబ్ధిదారులు అక్టోబర్ 1వ తేదీ ఇంటి వద్దనే అందుబాటులో వుండి సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లు తీసుకోవాలన్నారు. ఒకవేళ 1వ తేదీ పెన్షన్ తీసుకోని లబ్ధిదారులు 3వ తేదీ కచ్చితంగా ఇంటి వద్దనే తప్పకుండా అందుబాటులో వుండి పెన్షన్ తీసుకోవాలన్నారు.

### "కల్తీ"నెయ్యి "పాపం"లో

## ఏం తేల్చనున్నారు!?

### -అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్న సిట్ చీఫ్ త్రిపాఠి



తిరుమల, సెప్టెంబర్ 29(ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూల తయారీలో కల్తీనెయ్యి దుమారంపై దర్యాప్తునకు ఏర్పాటైన సిట్ బృందం విచారణలో ఏం తేల్చనుందనేది ఇప్పుడు సర్వత్రా సంచలనంగా మారింది. లడ్డూలకు జంతువుల కొవ్వునూనె, ఇతరత్రా నూనెలతో తయారైన కల్తీనెయ్యి సరఫరా జరగడం, దాన్ని పోటులోని కార్మికులు నాసిరకంగా ఉన్నా వినియోగించి పవిత్రమైన లడ్డూలు తయారుచేసి విక్రయించడం జరిగింది. ఇప్పుడు ఈ అంశంపై విచారణకు ప్రభుత్వం "ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ని ఏర్పాటు చేసింది. సిట్ అధికారులు ఆదివారం రెండవరోజు ఈ కేసును మరింత లోతుగా విచారణ ప్రారంభించింది. మూడు బృందాలుగా విడి పోయిన టీమ్‌లోని అధికారులు నెయ్యిసరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలు, కాంట్రాక్టర్ల వివరాలు సేకరించిన సిట్ అధికారులు కల్తీనెయ్యికి సూత్రధారులు, పాత్రధారులు ఎవరని తేల్చేపనిలో మూలాలు కదిలిస్తున్నారు. ముఖ్యంగా 2023 డిసెంబర్‌నెల నుండి2024 మేనెల వరకు తిరుమలతిరుపతిదేవస్థానానికి నెయ్యిసరఫరా చేయడానికి టెండర్లులో పాల్గొన్న సంస్థలు, సరఫరా చేసిన సంస్థలు ఉన్నవారి సమాచారంతో సిట్ విచారణకు కార్యాచరణ రూపొందించుకుంటుంది. లడ్డూల తయారీలో కల్తీనెయ్యి వాడారనే కేసుపై దర్యాప్తును అన్ని కోణాల్లో మొదలుపెట్టామని ప్రత్యేక బృందంలోని సిట్ చీఫ్ ,ఐజి సర్వశ్రేష్ఠత్రిపాఠి తెలిపారు. ఈ కేసును వేగవంతం చేస్తామని, నిర్దిష్ట పరిమితి లేదని, వీలైనంత వరకు త్వరగానే విచారణ చేసి రోజువారీగా దర్యాప్తు వివరాలు వెల్లడిస్తామని ఐజి తెలిపారు. ఈ మేరకు టిటిడి నుంచి సేకరించిన వివరాలతో సంబంధిత నెయ్యిసరఫరా చేసిన సంస్థల ప్రతినిధులతో బాటు గత టిటిడి బోర్డు పెద్దలకు, అధికారులకు నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

## గంగమ్మ ఆలయానికి తరగని భక్తుల రద్దీ



బోయకొండ(చౌడేపల్లి),

సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

శక్తిక్షేత్రం బోయకొండ ఆలయానికి యాత్రీకుల రద్దీ పెరిగింది. రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలివచ్చారు. దీంతో కొండ భక్తజన సంద్రమైంది. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. సాయంత్రం వరకు క్యూలైన్లలో భక్తులు కిటకిటలాడారు. ఆలయ ఇఓ ఉప కమీషనర్ ఏకాంబరం, అధికార, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## కాంతులీనుతున్న కలియుగవైకుంఠం



వైకుంఠం నుంచి శ్రీనివాసుడు శ్రీవేంకటేశ్వరస్వామిగా ఆవిర్భవించినప్పటినుండి జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు కలియుగవైకుంఠం తిరుమల ముస్తాబైంది. రకరకాల విద్యుద్దీపాల కాంతుల్లో తిరుమల నిజంగా కలియుగవైకుంఠమే తలపిస్తోంది. భక్తులను, సపరివారదేవతలను ఆహ్వానిస్తూ సప్తగిరులు సిద్ధమయ్యాయి. ఆలయం పరిసరాలు స్వామివారి ప్రతిరూపాలు భక్తులను గోవింద పలికిస్తున్నాయి.

## ప్రైవేట్ మద్యం షాపుల ఏర్పాటుకు రంగం సిద్ధం

- నేడో.. రేపో టెండర్ నోటిఫికేషన్లు..
- తగ్గింపు ధరలతో మద్యం అమ్మకాలు!!
- అందుబాటులో రానున్న అన్ని రకాల బ్రాండ్లు ..
- మద్యం ప్రియులకు పండగే పండగ !!

కుప్పం,చిత్తూరు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

గత ప్రభుత్వ పాలనలో ఏర్పాటైన ప్రభుత ్వ మద్యం దుకాణాల్లో పేర్లు పలకలేని కొత్తకొత్త మద్యం బ్రాండ్లు.. నాణ్యత లేని మద్యం.. అధిక ధరలు ఇవన్నీ మందుబాబుల్ని మత్తు వదిలేలా చేశాయి. దీంతో చేసేది లేక మద్యం ప్రియులు పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రం మద్యంపై మక్కువ చూపారు. అక్కడ ధరలు తక్కువగా ఉండడంతో మ ందుబాబులు ఛలో కర్ణాటక అనేవారు. నేడు ఆ పరిస్థితికి రాష్ట్ర ప్రభుత్వం చెక్‌పెడుతోంది. ఇటీవలే ప్రభుత్వ మద్యం దుకాణాలు రద్దు చేస్తూ ఆర్డినెన్స్ తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం గతంలో మాదిరిగానే ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే విధి విధానాలు ఖరారయ్యాయి. నేడో రేపో ప్రైవేట్ మద్యం షాపుల ఏర్పాటుకు టెండర్ నోటిషికేషన్లు



వెలువడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం 105 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా అదనంగా మరో 17 దుకాణాలు ప్రతిపాదిస్తూ మొత్తం 122 ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటుచేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రతిపాదనలు చేశారు. వీటికి ప్రభుత్వం అంగీకరిస్తుందా లేక పాత దుకాణాల సంఖ్యనే కొనసాగిస్తుందా వేచి చూడాలి. ఇదిలా ఉండగా టెండర్ దరఖాస్తు సమయంలో 2లక్షల రూపాయలు నాన్ రీఫ ండబుల్ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఈ నగదును ప్రభుత్వం తిరిగి చెల్లించదు. ఇక జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం లైసెన్సు ఫీజులను సైతం ఖరారు చేసినట్లు సమాచారం. పది వేల లోపు జనాభా ఉన్న ప్రాంతంలో దుకాణం ఏర్పాటుకు 50లక్షలు, పదివేలకు పైబడి 50వేలు జనాభా ఉంటే 55లక్షలు, 50వేలకు పైబడి లక్ష దాకా జనాభా ఉంటే 65లక్షలు, లక్షకు పైబడి జనాభా ఉన్న ప్రాంతాల్లో 85లక్షలు లైసెన్సు ఫీజుగా నిర్ణయించినట్లు తెలిసింది.

**బ్రాండెడ్ మద్యం.. తగ్గింపు ధరలు :**

ఇదివరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించిన నాసిరకం, నాణ్యత లేని మద్యం స్థానంలో అన్ని బ్రాండ్ల మద్యం అమ్మకాలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో బ్రాందీ, విస్కీ, రమ్, జిన్, వోడ్కా, బీర్లకు సంబంధించి బ్రాండెడ్ కంపెనీలకు చెందిన క్వాలిటీ మద్యం విక్రయాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇక గత ప్రభుత్వ హయాంలో పెంచిన మద్యం ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మద్యం క్వార్టర్ బాటిల్ ధర రూ 100ల నుంచి విక్రయించేలా ఆదేశాలు జారీ చేయనుంది. ఈ ధర గత ప్రభుత్వ హయాంలో కంటే యాభై రూపాయలు తక్కువనే చెప్పాలి. అన్ని రకాల మద్యం బ్రాండ్లపై ప్రభుత్వం ధరలు తగ్గించి ప్రైవేట్ షాపుల ద్వారా విక్రయాలు చేపట్టనుంది. ఇక ప్రైవేట్ మద్యం దుకాణాల పక్కనే పర్మిట్ రూమ్‌ల కోసం త్వరలోనే అనుమతులు మంజూరు చేయనున్నారు.

## మొగిలి ఘాట్‌లో ప్రమాదాల కట్టడికి చర్యలు

- పోలీసు శాఖ ఇంటర్సెప్టర్ వాహనం ఏర్పాటు
- వాహనాల వేగం పర్యవేక్షించడంతో పాటు రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో అవగాహన
- ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:

బెంగళూరు-చెన్నై జాతీయ రహదారి బంగారుపాళ్యం మండలం మొగలి ఘాట్‌లో రోడ్డు ప్రమాదాలను కట్టడి చేయడానికి చర్యలు ప్రారంభమయ్యాయి. మొగిటి ఘాట్ పరిసరాల్లో రోడ్డు ప్రమాదాలను కట్టడి చేయడానికి పోలీసు శాఖ త్వరితంగా స్పందించింది. మొగిలి ఘాట్‌లో ప్రమాదాలను కట్టడి చేయానికి ఇంటర్సెప్టర్ వాహనంను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ప్రకటించారు. ఇంటర్సెప్టర్ వాహనం ఏర్పాటుతో వాహనాల వేగంను పర్యవేక్షించడంతో పాటు రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మొగిలి ఘాట్‌లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం నిర్దిష్ట వేగ పరిమితి కంటే ఎక్కువ వేగంతో వాహనాలు నడుపడంతోనే తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడానికి ఎస్పీ మణికంఠ చందోలు మొగిలి ఘాట్ ప్రాంతంలో వాహనాల వేగంను పర్యవేక్షించడానికి ఒక ఇంటర్సెప్టర్ వాహనంను ఏర్పాటు చేశారు. ఈ వాహనం ప్రత్యేకంగా వాహనాల వేగంను కొలిచే అత్యాధునిక పరికరాలతో అమర్చబడిందన్నారు. గంటకు 40 కిమీ వేగం కంటే ఎక్కువ వేగంతో వెళ్ళే వాహనాలను ఇంటర్సెప్టర్ వాహనం ద్వారా గుర్తించి అతివేగంగా వాహనం నడిపినందుకు పోలీసు సిబ్బంది ఆ వాహనదారుడికి జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించి సురక్షితంగా ప్రయాణించడం ముఖ్యమని, రోడ్డు భద్రతా సూచనలతో కూడిన సంకేతాలు వివిధ పాయింట్లలో ఏర్పాటు చేశామన్నారు. మొగిలి ఘాట్ ప్రాంతంలో ట్రాఫిక్ పెట్రోలింగ్ టీమ్‌లు ఎప్పటికప్పుడు నిఘా వుంచి ప్రమాదాలు జరిగినపుడు సత్వరం సహాయం చేయడానికి ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. డ్రైవర్లకు రోడ్డు భద్రతా



మొగిలి ఘాట్‌లో ప్రమాదాల కట్టడికి పోలీసు శాఖ ఏర్పాటు చేసిన ఇంటర్సెప్టర్ వాహనం

నియమాలపై అవగాహన కల్పించడానికి చిత్తూరు పోలీసులు తరచుగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రయాణీకులు ఎప్పటికప్పుడు సీటు బెల్టులు ధరించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చునన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించడం అత్యంత ముఖ్యమైన రక్షణ చర్య అని, మద్యం సేవించి వాహనాలు నడుపడం ప్రమాదకరమని, పోలీసులు మద్యం సేవించి డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారన్నారు.

### తిరుపతి నగర పాలికలో

## ఆర్ఐలదే రాజ్యం!

### ఏళ్లతరబడి ఇక్కడే తిష్ట
### వారు చేసిందే చట్టం... వేసిందే టాక్స్...

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త




తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో కొందరు ఉద్యోగులు ఆడిందే ఆట... చేసిందే చట్టం... వేసిందే ట్యాక్స్ చెల్లింపుగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ సెక్షన్‌లో మరీ కొందరు ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్‌లు ఇందుకు అతీతులు కారనే విషయం అందరి నోటా వినిపిస్తోంది. ఇలా ఏ ఒకరో ఇద్దరో కాదు.. వందల సంఖ్యలో నగర ప్రజలు కొందరు ఆర్ఐలు, ఆ సెక్షన్‌లో ఉద్యోగుల పనితీరుపై ఆరోపిస్తున్నారు. మూడు నుండి నాలుగేళ్లు ఒకే చోట పనిచేస్తే వారిని మరో సెక్షన్‌కు బదిలీ చేయాలి.. ఐటి ఇంటర్నల్ బదిలీలు కూడా లేకపోవడంతో వాళ్ళు చెప్పే వేదంగా మారింది. ఏళ్ల తరబడి ఒకే చోట కుర్చీలకు అతుక్కు పోవడంతో కొందరు ఉద్యోగులు ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని జేబులు నింపుకుంటూన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకా కొందరు సీనియర్ అసిస్టెంట్‌లు ఆర్ఐలుగా పదోన్నతితో చలామణి అవుతూ అందిన కాడికి వసూలు చేస్తున్నారని, భవనాలకు ట్యాక్స్ నిర్ణయించడంలో చేతివాటం చూపెడుతూ జనం నుండి వసూళ్లకు మరిగారనేది ప్రధాన ఆరోపణలు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో 6 విభాగాలు ఉన్నాయి. వీటిలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ సెక్షన్‌లు ఆదాయం సమకూర్చే వనరులు. ఈ సెక్షన్‌లలో చాలా వరకు పది, పదిహేనేళ్ళకు పైగా ఒకే చోట, ఒకే కుర్చీలో ఉండటంతో వాళ్ళు ఏమి చేస్తున్నా మాకేంత లాభం అనేలా ఉద్యోగం వెళ్ళబుచ్చుతున్నారనే విమర్శలు లేకపోలేదు. పైగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ఏ ఐఏఎస్ అధికారులు కమిషనర్‌లుగా వచ్చినా తమ పెత్తనం చేసుకొంటూ ఆర్ఐలు కుర్చీలు వదలడం లేదు. ఇదే విషయం కార్యాలయంలో చిన్న అటెండర్ నుండి పైస్థాయి అధికారి వరకు చర్చ చేస్తున్నారు. కార్యాలయాల్లో ఏమీ జరుగుతోంది, ఎవరూ ఎంత కాలంగా పనిచేస్తున్నారు అనేది కూడా కమిషనర్లు ఆరా తీసి ఇంటర్నల్ బదిలీలు చేయాల్సి ఉన్నా రాజకీయ నేతల పెత్తనం, ప్రోద్భలంతో ఉద్యోగుల జోలికి వెళ్ళడం లేదు అని అంటున్నారు. ఎవరైనా కమిషనర్‌లు ధైర్యం చేసి ఉద్యోగులను బదిలీ చేసినా మళ్ళీ ఒత్తిడి చేసుకుని అదే సీట్లో కూర్చుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాము చెప్పిందే మాట అని అంటున్నారు. రెవెన్యూలో కూడా ఇందుకు అతీతులుకారని, పలువురు సీనియర్ అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్‌లు అవసరం బట్టి ట్యాక్స్ ఫిక్స షన్ చేస్తుంటారని విమర్శలు ఉన్నాయి. సహజంగా పన్ను నిర్ణయం అనేది కట్టిన భవనాలు బట్టి నిర్ణయిస్తారు. సెల్లార్‌తో బాటు రెండు ఫ్లోర్‌లకు నివాస గృహాలకు ఒక రేట్, ఆపై రెండు, మూడు అంతస్తులకు ఒక రేట్ నిర్ణయించి మరీ కావల్సిన వాళ్ళకు, చేతులు తడిపిన వారిని మరో రేట్ పన్ను నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ఇంకా కమర్షియల్, స్కూల్స్, షాపింగ్ మాల్స్, వ్యాపార దుకాణాలు, పెద్ద పెద్ద బహుళ అంతస్తుల భవనాలకు ఆర్ఐలు చేసిందే చట్టంగా పన్ను వేసి అందిన కాడికి వసూలు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. 21 మంది జూనియర్ అసిస్టెంట్‌లు, ముగ్గురు టైపిస్టులు, 14 మంది సీనియర్ అసిస్టెంట్లు ఉండగా శాశ్వతంగా ఆర్ఐలుగా ఉన్న వారే కొనసాగుతున్నారు. మిగిలిన వాళ్ళకు అవకాశం కల్పించలేదు. సుమారు 5 నుండి 10 ఏళ్ళకు పైగా కొనసాగుతున్న కొందరు ఆర్ఐలు సీనియర్లకు కొందరికి ఝలక్ ఇచ్చారనే ఆరోపణలు లేకపోలేదు. తిష్టవేసిన ఆర్ఐలపై కమిషనర్ ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

## కొండమిట్టలో విషజ్వరాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపాలిటీలోని ప్రజలు అనారోగ్యంతో తల్లడిల్లుతున్నారు. వాతావరణం కాలుష్యం చోటు చేసుకుంటుంది. అయితే కొండ మిట్టలో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ప్రతి ఇంటిలో విషజ్వరాలతో వణుకుతున్నారు. ఇక వాంతులు విరోచనాలు(అతిసారం)తో తల్లడిల్లుతున్నారు. సంపాదన తక్కువ ఆరోగ్య సమస్యలు ఎక్కువ కావటంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అయితే మున్సిపాలిటి సరఫరా చేస్తున్న మంచినీటి కలుషితంతోనే ఇలా జరుగుతుందని జనం వాపోతున్నారు. ఓ వైపు దోమల బాధ మరో వైపు నీటి కాలుష్యంతో తల్లడిల్లుతున్నారు.

**కాలువల్లో పైప్ లైన్లు: ఏ పైప్ లైన్ ఎక్కడుందో అంతుపట్టని స్థితి:**

శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో పురాతన కాలం నాటి పైప్ లైన్లు. 1982-99లో వేసిన పైప్ లైన్లు. కొండమిట్ట ప్రాంతమంతా మిట్ట ప్రాంతం అక్కడి ప్రజలకు మంచినీటిని అందించుటకు వీధీ వీధికి పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసారు. ఇక్కడ కనీసం సదుపాయాల్లో భాగంగా మురుగునీటి కాలువలు నిర్మించారు. అయితే వీటి నిర్మాణాల్లో మున్సిపల్ అదికారుల మధ్య సమన్వయం కొరవడిందని చెప్పవచ్చు. మంచినీటి సరఫరా పైప్‌లైన్ల పైన మురుగునీటి కాలువలను నిర్మించారు. ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బందికి ఎక్కడ కాలువలో ఎక్కడ పైప్ లైన్లు తెలియదు. ముఖ్యంగా తొండమ్‌లేని వినాయకుడు ఆలయం నుంచి తూర్పున ఉన్న లేన్‌లో ఇబ్బంది కల్గింది. ఎక్కడ పైప్‌లైన్‌లోకి మురుగునీరు వస్తుందో గుర్తించలేక పోతున్నారు. కొన్ని చోట్ల గుర్తించారు. మరమ్మత్తులు చేపట్టారు. అయినా కలుషిత నీరు ఆగలేదు. ఆ నీరు తాగిన, వాడిన వినియోగదారులు రోగాల బారిన పడటం మానలేదు. రోగాలతో కుములుతూ ఇబ్బందులు పడుతున్నారు. విరేచనాలు అని డాక్టర్ వద్దకు వెళ్ళితే కనీసం రూ.2వేలు బిల్లు చేస్తున్నారు. ఇక జ్వరం అంటే ఐదారు రకాల ట్యాబ్‌లెట్లు రాస్తున్నారు. మరో అడుగుముందుకు వేసి లాబ్ పరీక్షలంటూ వేలకు వేలు ఖర్చు పెడుతున్నారు.




అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శాస్త్రోక్తంగా పవిత్రాలను తీసుకెళుతున్న అర్చకులు

## కారు ఢీకొని బాలుడి మృతి

గూడూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

కారు ఢీకొని బాలుడు మృతి చెందిన సంఘటన ఆదివారం గూడూరులోని ఎస్‌కెఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో చోటు చేసుకుంది. సైదాపురం మండలం వేములచేడులో ఎస్‌జిటి ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎగువ వీరారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కానగుర్తి రవి చిన్న కుమారుడు లీలా విన్షిత్ (11) గూడూరు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో తండ్రి కానగుర్తి రవి, అన్న అయిన భాను వెంకట్ వర్షిత్‌లతో కలిసి ఆడుకోవడానికి గూడూరులోని ఎస్‌కెఆర్ డిగ్రీ కాలేజి గ్రౌండ్‌కు సాయంత్రం ఆడుకోవడానికి వెళ్ళాడు. బాలుడు లీలా విన్షిత్ ఆడుకొంటుండగా గూడూరు పట్టణానికి చెందిన ఓ యువకుడు గ్రౌండ్‌లో డ్రైవింగ్ నేర్చుకొనే క్రమంలో కారును అతివేగంగా అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడిపి లిలావిన్షిత్‌ను గుద్దడంతో తీవ్ర గాయాలైయ్యాయి. దీంతో తండ్రి రవి గూడూరు పట్టణంలోని మైథిలి ఆసుపత్రికి తీసుకెళ్ళగా అక్కడ వైద్యం చేయకుండా నిరాకరించడంతో గూడూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం బాలుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. గూడూరు 2 టౌన్ ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తన కుమారుడు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని గూడూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐకి కానపర్తి రవి ఫిర్యాదు చేశారు.

## ఉత్సాహంగా ఉపాధ్యాయుల ఆటల పోటీలు

**చిత్తూరు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:**



యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా చిత్తూరు మెసానికల్ మైదానంలో జిల్లా యుటి ఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యా యుల ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఉపాధ్యాయుల ఆటల పోటీలను జిల్లా యుటిఎఫ్ అధ్యక్షుడు ఎం. సోమశేఖర్ నాయుడు ప్రారంభించారు. జిల్లాలోని నాలుగు డివిజన్ల నుండి ఉపాధ్యాయులు క్రికెట్, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, షాట్‌పుట్, జావలిన్‌త్రో, పరుగు పందెం, క్యారమ్స్ తదితర పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం పెంచడానికి తోడ్పడుతుందన్నారు. ఈ క్రీడల్లో విజయం సాధించిన వారికి యుటిఎఫ్ నాయకులు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే అక్టోబర్ 4 నుండి గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించిన ఉపాధ్యాయులను యుటిఎఫ్ నాయకులు అభినందించారు. ఈ పోటీల్లో రాష్ట్ర కార్యదర్శి జివి రమణ, జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి మణిగండన్, నాయకులు సిరాజుద్దీన్, సూరుద్దీన్, దీనావతి, కె.రెడ్డప్పనాయుడు, కె.సరిత, డి.ఏకాం బరం, పార్థసారధి, పంటపల్లి సురేష్, కె.గణేష్‌కుమార్, ఎంవి రమణ తదితరులు హాజరయ్యారు.

## బదిలీ అయిన పోలీసు సిబ్బందికి సన్మానం

**పాలసముద్రం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:**



పాలసముద్రం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించి బదిలీ అయిన పోలీసు సిబ్బందికి ఆదివారం ఎస్ఐ భారతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఎఎస్ఐలు చక్రవర్తి, మురుగేష్‌లు, కానిస్టేబుళ్ళు రమేష్, మహేష్‌లను సన్మానించి వీడ్కోలు పలికారు. అలాగే నూతనంగా వీరి స్థానంలో బదిలీపై వచ్చి విధుల్లో చేరిన ఎఎస్ఐలు లక్ష్మి, రవిలు, హెడ్‌కానిస్టేబుళ్ళు రామకృష్ణ, రమేష్, ఖాదర్‌భాషలు, కానిస్టేబుళ్ళు రజని, సుభాష్, కిషోర్‌లకు పూల మాల వేసి స్టేషన్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:**

పజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశ భవనంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిల్లో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు విధిగా హాజరై ప్రజ ల నుండి అందిన సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశిం చారు.

## మురికివాడల్లో దోమల కట్టడికి చర్యలు

**చిత్తూరు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:**



మురికివాడల్లో దోమలను పూర్తి స్థాయిలో కట్టడి చేయడానికి మున్సి పల్ అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగసముద్రం హౌసింగ్ కాలనీలో ఆదివారం సిపిఐ పార్టీ శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ చిత్తూరు నగర పరిధిలో మంగసముద్రం హౌసింగ్ కాలనీ, పెద్ద దళితవాడ, ఇరువారం, జానకారపల్లి, అంబేడ్కర్‌నగర్, కట్టమంచి, తేనెబండ దళితవాడ, తోటపాళ్యం, వెంగళరావుకాలనీ, మున్సిపల్ స్కావెంజర్స్ కాలనీ, శ్రీనివాసనగర్, కుమార్‌నగర్‌కాలనీ, తంగవేలు కాలనీ, ఇందిరమ్మ కాలనీ, చవటపల్లి, వన్నియార్ బ్లాక్ తదితర ప్రాంతాల్లో మురికి కాలువల్లో నీరు నిల్వ వుండి దోమలు ఉత్పత్తి విపరీతంగా వుందన్నారు. చిత్తూరు నగర ప్రజానీకం డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, ఇతర వైరల్ జ్వరాల బారిన పడే అవకాశం వుండటంతో మున్సిపల్ కమీషనర్ జోక్యం చేసుకునిదోమల కట్టడికి పక్కాగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు రమాదేవి, విసి గోపినాధ్, కె.మణి, దాసరి చంద్ర, లతారెడ్డి, గిరిజ, పద్మ, సుశీలమ్మ పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో రూ.7 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు

- నాడు మాటిచ్చారు.. నేడు రోడ్లు వేస్తున్నారు !!



**కుప్పం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

కుప్పం మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు మహర్దశ పట్టింది. ఎన్నికలకు ముందు తెదేపా నేతలు గ్రామాల్లో అవసరమైన చోట్ల రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నేడు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో గ్రామాల్లో నూతనంగా సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నారు. కుప్పం మండలంలో ఇప్పటికే మొదటి విడతగా 2.73కోట్ల రూపాయల నిధులతో 35 సిమెంట్ రోడ్ల నిర్మాణాలు గ్రామాల్లో చేపట్టారు. వీటిలో దాదాపు ఇరవై రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇక రెండో విడతలో మరో 4.50కోట్ల రూపాయల నిధులతో 56 సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరయ్యాయి. ఏళ్ల తరబడి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న గ్రామీణ జనం తమ గ్రామాలకు కొత్తగా రోడ్లు వేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క కుప్పం మండలంలో ఉన్న 34 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి మరుగుదొడ్ల నిర్మాణాలకు సైతం నిధులు మంజూరయ్యాయి. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణంకు 53వేల వంతున మొత్తం 18లక్షలతో మరుగుదొడ్లను నిర్మిస్తున్నారు. ఈసందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు మాట ఇచ్చామని, ఇచ్చిన ప్రతి హామీలను నేడు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో నెరవేర్చుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని తాము వమ్ము చేయమని పేర్కొన్నారు. చేపడుతున్న పనుల్లో నాణ్యత ఉండేలా నిరంతరం పనుల పర్యవేక్షణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కుప్పం మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు.

## ఆర్టీసీ వైస్‌చైర్మన్‌ను సత్కరించిన ఎన్ఎంయుఎ ఉద్యోగులు

**కుప్పం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**



ఎపిఎస్ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నంను నేష నల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్య క్షుడు వేలు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, డిపో వర్కింగ్ అధ్యక్షుడు ప్రసాద్, ఛైర్మన్ బొట్టుమణి, అధ్య క్షుడు మునస్వామి, కార్యదర్శి జయపాల్, జాయింట్ కార్యదర్శి మునెప్ప, నేతలు గోవిందరాజులు, ఖలీ ల్,దిలీప్‌కుమార్, సురేష్‌కుమార్, సుభాన్,హరిబాబు, శ్రీధర్,రాజా, బాలాజీ, దిలీప్,చంద్ర,మధుపాల్గొన్నారు.

## నేడు పోలీసు గ్రీవెన్స్

**చిత్తూరు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ మణికంఠ చందోలు పాత జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు హాజరై తమ సమస్యలను ఎస్పీ మణికంఠ చందోలు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవచ్చును.

## ఉచితంగా రైతులకు నిమ్మమొక్కలు పంపిణీ

**పెద్దపంజాణి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :**



మండలంలోని రాజుపల్లి పంచాయతీ కమ్మినాయినపల్లికి చెందిన భానుప్రతాప్ రెడ్డి గ్రామంలోఉన్న రైతులకు ఉచితంగా 50నిమ్మమొక్కలను ఆదివారం పంపిణీచేశారు. పొలాలు,ఇళ్ళవద్ద ఈమొక్కలు పెంచుకుంటే ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఉచితంగా నిమ్మమొక్కలు అందించిన భానుప్రతాప్ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంజునాథ్ రెడ్డి, నాగరాజు యాదవ్, గణేష్, మునీంద్ర, ఆది, వేణుగోపాల్ రెడ్డి,కృష్ణారెడ్డి, రాజారెడ్డి(దాన), బాలాజీ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## దేశ అభ్యున్నతికి ఉపయోగపడేది విద్యార్థులే



**యర్రావారిపాలెం,సెప్టెంబరు 29 ప్రభాతవార్త** దేశ అభ్యున్నతికి ఉపయోగపడేది విద్యార్థులే అని యర్రావారిపాలెంలోని ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. ఆదివారం ఆ పాఠశాలలో 2015-16వ సంవత్సరపు పదవతరగతి విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఆమెమాట్లాడుతూవిద్యార్థులుఅందరు వృద్ధిలోకి వచ్చి సమాజాభివృద్ధికి వారి తోడ్పాటును అందిస్తే ఉపాధ్యాయుల కృషి ఫలించినట్లే అని అన్నారు. విద్యార్థులు ఎంత చక్కగా చదువుకుని ముందుకు వెళ్తారో దేశం అంత గొప్పగా వృద్ధి చెందు తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 2015-16వ సంవత్సరపు పూర విద్యార్థులు పాఠశాలకు ఆర్ఓ ప్లాంటును అందజేశారు. ఎంఈఓ బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిత్తూరు మార్కెట్ చౌక్‌లో గుడ్డబ్యాగులు పంపిణీ

**చిత్తూరురూరల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:**



చిత్తూరునగరం, మార్కెట్ చౌక్‌లో ఆదివారం సెంట్రల్ మండల అధ్యక్షుడు షణ్ముగం ఆధ్వర్యంలో మార్కెట్ చౌక్‌లో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు గుడ్డబ్యాగులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని జన్మదినం సందర్భంగా సెప్టెంబరు 17వ తేది నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి గుడ్డబ్యాగులను ప్రతి ఒక్కరు వాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యురాలు దుర్గారామక్రిష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రవికుమార్, మండల అధ్యక్షుడు రామభద్ర తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు వాసవి క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ తయారీ

**చిత్తూరురూరల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:**



చిత్తూరు పట్టణం, చిత్తూరు వాసవి క్లబ్ గ్రేటర్ అధ్యక్షులు గోవర్ధన్ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు ఆదివారం చిత్తూరు ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో కలసి సీడ్ బాల్స్ తయారుచేస్తూ వారికి అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, ఈ సీడ్ బాల్స్‌ను ఖాళీ స్థలాలలో వేయడం వల్ల వర్షాలకు మొలకెత్తి వృక్షాలుగా మారే అవకాశం ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఇతర ప్రాంతాల నుంచి సీడ్స్ తెప్పించి బాల్స్‌గా తయారుచేసి క్లబ్ సభ్యులతో కలసి ఖాళీ ప్రదేశాలలో చల్లడం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరింపేట దేవి ఇంగ్లీషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఎన్ఆర్ ప్రసాద్, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డిఇవో పూల్ పండితులకు వెంటనే ప్రమోషన్ కల్పించాలి

**చిత్తూరురూరల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:**

ఉమ్మడి జిల్లాలో గల డిఇవో పూల్ (తెలుగు, హిందీ) పండితులకు వెంటనే ప్రమోషన్ కల్పించాలని కన్వీనర్లు సామినాధ్, కమల్‌నాధ్, కిరణ్‌కుమార్, శభాపతిలు డిమాండ్ చేసారు. ఆదివారం ఓ ప్రైవేట్ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తమకు కేడర్, ప్రమోషన్ లేక తోచిన విధంగా రీతిలో ప్రతి సంవత్సరం బదిలీలు చేస్తూ అనేక రకాల ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. తమకు జీవో 91 ప్రకారం న్యాయం జరిగిలే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.పండితులందరూ ఐక్యమత్యంగా ఉమ్మడి కార్య చరణ రూపొందించి పదోన్నతే తమ లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా డిఇవో పూల్ పండితులు పాల్గొన్నారు.

## అపూర్వం చిన్ననాటి నేస్తాల సమ్మేళనం

**పుదిపట్ల(చౌడేపల్లి), సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

చదువులయిపోయి జీవితంలో స్థిరపడి ఎక్కడెక్కడో వున్న నేస్తాల కలయికకు మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్ల ఉన్నతపాఠశాల వేదకయ్యింది. ఉన్నతపాఠశాలలో 1990-91 పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. దాదాపు 35యేళ్ళ తర్వాత కలుసుకొన్న స్నేహితులు వయస్సును మరచి చిననాటి జ్ఞాపకాలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. తమ ఉన్నతికి కారకులైన గురుదేవుళ్ళు వెంకటపతి, చంద్రశేఖర్ మాస్టార్లను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసుకొని పాఠశాల అభివృద్ధికి ప్రణాళికలు వేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో 1990-91పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన భాజపా నేతలు

**కోట,సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

ప్రధాని మోదీ ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని కోట మండల భాజపా మండల శాఖ అధ్యక్షులు డా.సారంగం రమేష్‌బాబు అన్నారు. కోటలో తన నివాసం నుంచి ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ఆదివారం మోదీ 114 వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ముసునూరు శక్తి కేంద్రం పరిధిలో వీక్షించారు. దేశ ప్రజలతో మమేకం కావాలనే లక్ష్యంతో మోదీ ఈ కార్యక్రమం ప్రారంభించారని రమేష్‌బాబు తెలిపారు.ఈనాటి మన్ కీ బాత్‌లో మేకిన్ ఇండియా కార్యక్రమంతో భారత్ తయారీ రంగంలో భారత్ పవర్ హౌస్‌గా మారిందని మోదీ వెల్లండిచారని పేర్కొన్నారు

## నిత్యం నడకతో గుండె పదిలం

**కోట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

రోజూ క్రమ తప్పకుండా 45 నిమిషాలపాటు నడవడాన్ని అలవాటుగా మార్చుకుంటే గుండె ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కోటలోని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్, డాక్టర్ రూప అన్నారు.ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవన శైలీలో వేగంగా వస్తున్న మార్పులతో హృదయ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా గుండె పోటుకు గురవుతుండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోందన్నారు.ఉయదం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపిన వారు ఉన్న పళంగా కుప్పకూలి మృత్యువడికి చేరుకుంటున్నారని పేర్కొన్నారు. రోజు వారీ పనుల్లో ఒత్తిడి, వ్యాయామం చేయకపోవడంతో ,ఆహార అలవాట్లు ,పొగ తాగడం, తదితర కారణాలతో ఎక్కువ మంది గుండె పోటుకు గురవుతున్నారని చెప్పారు. రోజు కనీసం 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి, చెమట పట్టేంత వరకు నడక సాగించాలి, ఆకుకూరలు, కూరగాయలతో పాటు పండ్లు తినాలి, బీపీ,షుగర్, నియంత్రణలో ఉంచుకోవాలి, ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు చేయడం అభినందనీయం: నెలవల

**దొరవారిసత్రం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన దొరవారిసత్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏరా ్పటు చేయడం అబినంధనీయమని సూళ్ళూరుపేట తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం అన్నారు.ఆయన ఆదివారం దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేస్తున్న అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.అనంతరం నెలవల చేతులమీదుగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల సుబ్రమణ్యం మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం దొరవారిసత్రంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. సమాజంలో ప్రజలు అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన వెంట మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు, మండలపార్టీ ఉపాధ్యక్షుడు దువ్వూరు గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి బందిల ఉదయ్‌కుమార్, యాగాని ఆదిముని, శేఖర్, కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం

**గూడూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**



గూడూరు మండల పరిధిలోని చెంబడిపాలెం గ్రామంలో కమ్యూనిటీ హాల్‌లో రచ్చబండను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి దాతలుగా ఎన్ఆర్ఐ పల్లిపాటి రమణయ్య, డాక్టర్ అరుణలు వ్యవహరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ చెంబడిపాలెం గ్రామంలో పల్లిపాటి రమణయ్య అమెరికాలో స్థిరపడి, తన గ్రామం కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని జన్మనిచ్చిన ఊరి కోసం సేవ చేయాలనే ఉద్దేశ్యంతోనే గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ ముందు ఉంటున్నారన్నారు. గ్రామస్థులు కోరిక మేరకు కమ్యూనిటీ హాల్, రచ్చబండ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. అనంతరం గ్రామస్తులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పల్లిపాటి అరుణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి పల్లిపాటి జోసెఫ్, ఎంఆర్‌పిఎస్ నాయకులు మంగళపూరి సురేష్, టిడిపి నాయకులు రాపూరు శ్రీనివాసులు, వైద్యులు వెంకటేశ్వర ప్రసన్న, మధుసూధన్, మహేంద్రనాథ్ రెడ్డి, రేచర్ల త్రివిక్రమ రావు, నారా కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలను విజయవంతం చేయండి

ఆలయ కమిటి సభ్యులు నెల్లూరు మోహన్ రెడ్డి

**కోట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

కోట మండలం విద్యానగర్‌లోని శ్రీవిద్యా గణపతి ఆలయంలో అక్టోబరు 3నుంచి 12 వరకు జరిగే శరన్నవరాత్రి మహోత్సవాలకు జరగనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు నెల్లూరు మోహన్ రెడ్డి చెప్పారు. ఆ మేరకు ఆయన భక్తులకు ఆహ్వానం పలికారు. ఆయన ఆదివారం విద్యానగర్‌లోని విలేకర్లతో మాట్లాడుతూ ఈ దసరా ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 3న స్వర్ణకవచదేవీ అమ్మవారి అలంకారం,4న బాలత్రిపుర సుందరి, 5న గాయత్రీ, 6న శ్రీఅన్నపూర్ణ 7న శ్రీ లలిత, 8న శ్రీమహాలక్ష్మీ, 9న సరస్వతి, 10న శ్రీ దుర్గాదేవీ, 11న శ్రీమహిషాసురమర్దిని, 12న రాజరాజశ్వరీ అమ్మవారి అలంకారం, సాయంత్రం అమవారి ఉత్సవం ఉంటుందన్నారు. ప్రతి నిత్యము ఉదయం నాలుగు గంటలకు సుప్రభాత సేవ, విశేష ద్రవ్య అభిషేకం,మంగళ హారతులు, సహస్రనామార్చన వేద పారాయణాలు, కలశపూజలు, తీర్ధ ప్రసాద వితరణ ఉంటాయన్నారు.దీపాలంకరణ సేవ, అమ్మవారిఅలంకరణ ఉంటుందన్నారు.అమ్మవారి నిజరూపము అలంకారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో సాంస్కతిక కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని నెల్లూరు మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## హోరా హోరీగా సాగుతున్న క్రికెట్ మ్యాచ్



**వెంకటగిరి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**

తారకరామా క్రీడా ప్రాంగణంలో హోరాహోరీగా క్రికెట్ పోటీల్లో జరుగుతున్నాయి. ఏసిఏ ఆధ్వర్యంలో అండర్ 15 ఉమెన్స్ పోటీలు జరుగుతున్నాయి. మాధురి సంజన 89 రన్స్ చేసి 99 బాల్స్ కొట్టారు. పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి.

## ఎక్సైజ్ సిఐ బదిలీ

**వాకాడు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**



వాకాడు ఎక్సైజ్ కార్యాలయం సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న దేవర శ్రీనివాసులు ప్రభుత్వ జనరల్ బదిలీలో భాగంగా ప్రకాశం జిల్లా వినుకొండకు బదిలీ అయ్యారు. వాకాడుకు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఆర్‌వియు ప్రసాద్ రానున్నారు. వాకాడు ఎక్సైజ్ శాఖలో సబ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేసిన జయరావు పదోన్నతిపై ప్రకాశం జిల్లా గిద్దలూరు ఎక్సైజ్ శాఖకు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా వెళ్లారు. ప్రభుత్వం జనరల్ బదిలీలో భాగంగా స్టేషన్‌లోని సిఐ, ఎస్ఐ ఇప్పటికే బదిలీలు అయ్యారు. త్వరలో కానిస్టేబుల్ కూడా బదిలీలు అయ్యే అవకాశం ఉందని తెలిసింది.

## సూళ్లూరుపేటలో రక్తదాన శిబిరం

**సూళ్లూరుపేట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**



సూళ్లూరుపేటలో విశ్వహిందూ పరిషత్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకర ప్రతిమ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ వారి సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 50 మంది రక్త దాతలు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎజి కిషోర్, పొన్నా కాటయ్య, బైరి పార్థసారధి, సిహెచ్ రమణయ్య, నాగరాజు, మల్లి స్వామి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో సరుకులు పంపిణీ

**సూళ్లూరుపేట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**



సూళ్లూరుపేటలోని వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రూపేష్, లావణ్యల కుమారుడు జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక బాపూజీ కాలనీలోని శ్రీసాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఫల సరుకులను పంపిణీ చేశారు. నెలరోజులకు సరిపడే వస్తువులను ఈ సందర్భంగా వృద్ధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్‌కు చెందిన సాయిరాం, సునీత, మునిత్యాగరాజు, మోహన్, కళావతి, శైలజ, వేదవతి తదితరులు పాల్గొన్నారు.

## కోటలో 7,035 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

**కోట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

అక్టోబర్ నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఓ మారెళ్ల భవాని చెప్పారు. ఆమె ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ కోట మండలంలో 7035 మందికి రెండు కోట్ల 95 లక్షల 40వేల రూపాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1, 3 తేదీలలో మాత్రమే పంపిణీ చేస్తామని తెలిపారు. వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులకు, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు, చర్మకారులు, డప్పు కళాకారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులెవరూ పింఛన్ కోసం సచివాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.

## వైద్యం కోసం ఆకుతోట ఆర్థికసాయం

**సూళ్లూరుపేట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**



సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారు పోలూరు గ్రామంలో ఇంటర్మీడియట్ చదువుతున్న హేమ అనే విద్యార్థి అరుదైన వ్యాధితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో హేమ వైద్యానికి తన వంతు సహాయంగా సూళ్లూరుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్ తన అనుచరులతో కలిసి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే బూత్ కన్వీనర్ సిహెచ్ సురేష్ భార్య ఆరోగ్య పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఆమెకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ఆకుతోట రమేష్ అందించారు. ఈ కార్యక్రమంలో పాములు మునస్వామి, యుగంధర్, ఎం.కృష్ణయ్య, శ్రీనివాసులు, పి.కృష్ణయ్య, సురేష్, కె.శ్రీధర్, గిరి, ఆలీభాయ్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## వట్రపాలెంలో కార్డెన్ సెర్చ్

**సూళ్లూరుపేట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని వట్రపాలెంలో ఆదివారం నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటువంటి పత్రాలు లేకుండా ఉన్న 12 మోటార్‌బైక్‌లు, ఒక ఆటోను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే వట్రపాలెం వాసులు తమ ప్రాంతంలో యువతుల పట్ల ఆకతాయిల వేధింపులు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని సిఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మానాయుడులను ఆదేశించారు

## సూళ్లూరుపేటలో తూనికలు కొలతలశాఖ దాడులు

**సూళ్లూరుపేట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

సూళ్లూరుపేట పట్టణంలో జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆదివారం వివిధ దుకాణాలపై దాడులు నిర్వహించారు. బియ్యం విక్రయించే దుకాణాల్లో తూకం సరిగా లేకపోవడంతో పలు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. అలాగే చేపలు, చికెన్ దుకాణాలలో తనిఖీలు చేసి వారి తూకాల్లోనూ తేడాలున్నాయని గుర్తించి కేసులు నమోదు చేయడంతో పాటు భవిష్యత్‌లో ఇటువంటి పొరపాట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తూనికలు కొలతలశాఖ సీఐ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. తూనికలు కొలతలశాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పట్టణంలోని దుకాణదారులు తమ అంగళ్లు స్వచ్ఛంధంగా మూసివేశారు.

## పులివేంద్రలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం

**తడ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**



తడ మండలం పులివేంద్రలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిపారు. సూళ్లూరుపేట భవన నిర్మాణ రంగ కార్మిక సంఘ గౌరవాధ్యక్షుడు కె.సాంబశివయ్య పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికులు ఇసుక అందుబాటు లేక పనులు జరగ లేదని, ప్రస్తుత ప్రభుత్వంలోను అదే సమస్య ఎదురవుతోందని చెప్పారు. గతంలో అడ్డగోలుగా ఆపేసిన సంక్షేమ బోర్డును పునరుద్ధరించి అందులో ఉన్న ప్రయోజనాలను అమలుపరచాలని చెప్పారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షునిగా వై.భాస్కర్, ఉపాధ్యక్షులుగా వెంకటరత్నం, కార్యదర్శిగా మునికృష్ణ, ఉప కార్యదర్శిగా చిన్నయ్య, కోశాధికారిగా మస్తాన్‌లను ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా కమిటీ సభ్యుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వపు విద్యార్థుల సమావేశం

**వెంకటగిరి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**



ఆర్కే వై జడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో 1986 - 87 సంవత్సరం చదివిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాఠశాల చదువు అనంతరం ఎక్కడెక్కడ వృత్తి స్థిరపడిన వారు కలుసుకొని తీపి గుర్తులను గుర్తు చేసుకున్నారు. మొట్టమొదటి సారి కలుసుకున్నట్లు పూర్వపు విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయుడు రాధాకృష్ణయ్య, సుశీలమ్మ, సుబ్రమణ్యం, కుమారి పాల్గొన్నారు. పూర్వపు విద్యార్థులు జె. మాధవి, బి. కరుణ శ్రీ, సుగుణ, వసంత, వెంకటరత్నం, అల్లం భారతి తదితరులు పాల్గొన్నారు.

## శరన్నవరాత్రులకు రాజకీయ సెగ

**- పోటా పోటీగా ఇరు పార్టీలు కరపత్రాలు ఆవిష్కరణ**



శ్రీరంగరాజపురం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త: కార్వేటినగరం మహారాజా ఇలవేల్పు ఆరిమాకులపల్లిలో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు రాజకీయ సెగ తగిలింది. శరన్నవరాత్రుల ఉత్సవాలకు సంబంధించి ఆదివారం పోటా పోటీగా నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఇటు ఆలయ చైర్మన్ లింగారెడ్డి, జడ్పీటీసీ తమన్‌ప్రసాద్‌రెడ్డి, ఇతర వైకాపా నాయకులు ఆవిష్కరించారు. అలాగే మరోవైపు ఇదే గంగమ్మ తల్లి శరన్నవరాత్రుల ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలను జిల్లా తెలుగుదేశం నాయకుడు గంధమనేని రాజశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో తయ్యూరు పాయకట్టుకు సంబంధించి కొంతమంది నాయకులు విడిగా ముద్రించిన కరపత్రంను పంపిణీ చేశారు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఆలయ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఎవరు నిర్వహిస్తారనే విషయంపై సందిగ్ధం నెలకొంది. ప్రతి ఏడాది నవరాత్రి ఉత్సవాలను తయ్యూరు పాయకట్టు సంబంధించిన 18 గ్రామాల ప్రజలు ఉభయదారులుగా వ్యవహరించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా సాంప్రదాయ బద్ధంగా ఈ ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తారు. చుట్టప్రక్కల గ్రామస్తులతో పాటు మండలంలోని భక్తులు, ఇరత ప్రాంతాల నుండి వచ్చే భక్తులు పాల్గొని అమ్మ వారికి తమ మ్రొక్కులు తీర్చుకుంటారు. ఇక్కడి దసరా ఉత్సవానికి జిల్లాలోనే ఓ ప్రత్యేకత వుంది. ఈ పరిస్థితుల్లో స్థానికులు మాత్రం పార్టీలకు అతీతంగా దైవకార్యంను నిర్వహించాలని నాయకులను కోరుతున్నారు.

## పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతిస్తాం : ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త : పవన్ కళ్యాన్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన కమిటీ సమావేశం స్థానిక హోటల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాన్ తిరుపతి పర్యటనను విజయవంతం చేయాలని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కమిటీ నిర్ణయించిందని డిప్యూటీ సిఎం తొలిసారి తిరుపతికి వస్తున్నందున అక్టోబర్ 3వ తేది జరిగే వారాహి బహిరంగ సభను ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ప్రపంచ వ్యాప్తంగా హిందువులకు ఆరాధ్య దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాల్లో వాడే నెయ్యిని జంతు కొవ్వు, పంది కొవ్వు, చేపల నూనె కలగలిపి అపచారం చేసారని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ పాలనలో శ్రీవారికి జరిగిన అపచారాన్ని మన్నించాలని ప్రాయశ్చిత్త దీక్షను పవన్ కళ్యాణ్ చేపట్టారని ఆయన తెలిపారు. తిరుమలలో ప్రాయశ్చిత్త దీక్ష విరమించేందుకు అక్టోబర్ 1వ తేది సాయంత్రం తిరుపతికి పవన్ కళ్యాణ్ వస్తున్నట్లు ఆయన చెప్పారు. 1వ తేది సాయంత్రం 3 గంటలకు రేణిగుంట విమానాశ్రయంకు పవన్ కళ్యాణ్ చేరుకుని 4 గంటలకు అలిపిరి పాదాల మండపం చేరుకుని పూజలు నిర్వహించిన తరువాత నడక మార్గాన తిరుమలకు చేరుకుంటారని ఆయన వివరించారు. రెండవ తేది ఉదయం శ్రీవారిని పది గంటలకు దర్శించుకోనున్నారు. దర్శనం అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కాంప్లెక్స్‌ను పవన్ కళ్యాణ్ పరిశీలించనున్నట్లు ఆయన చెప్పారు. మూడవ తేది సాయంత్రం 3 గంటలకు వారాహి బహిరంగ సభకు తిరుమల నుంచి బయలుదేరి సభాస్థలానికి చేరుకుంటారని ఆయన చెప్పారు. ఈ సభను విజయవంతం చేసేందుకు జనసైనికులు, వీరమహిళలు, పవన్ కళ్యాన్ అభిమానులు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాయలసీమ జనసేన కో కన్వీనర్ రాందాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

**-ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా కార్యక్రమాలు..**

పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష విరమణకు ముందు పలు కార్యక్రమాలు నిర్వహించాలని జనసేన పార్టీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 30వ తేది రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో దీపాలు వెలిగించాలని, అక్టోబర్ 1వ తేది ఓం నమో నారాయణాయ అనే మంత్రాన్ని ఆలయాలు, యోగ కేంద్రాల్లో నిర్వహించాలని పార్టీ కోరింది. కాగా అక్టోబర్ 2వ తేది నగర సంకీర్తన, 3వ తేది ఆలయాల్లో భజన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాలను కూడా విజయవంతం చేసి పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే ఆరణ శ్రీనివాసులు కోరారు.

## భక్తులకు అందుబాటులో ఆర్జిత సేవా టిక్కెట్ కౌంటర్లు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులకు అందుబాటులో ఆర్జిత సేవా టిక్కెట్ కౌంటర్లును ఏర్పాటులో ఇఒ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ శ్రీకారం చుట్టారు. ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా ఆయన సంస్కరణలను క్షుణ్ణంగా పరిశీలించిన మీదట చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపధ్యంలో ఇక మీద రాహుకేతుదోష నివారణ పూజల టిక్కెట్లు, 17 సేవలకు సంబంధించిన టిక్కెట్లు ఆలయ పరిసరాల్లోని ఏ కౌంటర్లో అయినా తీసుకునే విధంగా రూపకల్పన చేసారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పలు చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం ఎక్కడ ఏం జరుగుతుందో తెలుసుకుంటూ చర్యలు తీసుకుంటున్నారు.

**భక్తుల సదుపాయానికే ప్రాధాన్యం:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులకు సుదర్శనం, సిబ్బంది సంప్రదాయాలకు అనుగుణంగా నడుచుకొనుటకు ఆర్‌జెసి ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ పెద్ద పీట వేస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి గతంలో కూడా ఆజాద్‌కు అవగాహన ఉంది. ఈ నేపధ్యంలో గతంలో ఆర్జిత సేవా టిక్కెట్లు కౌంటర్ దక్షిణ గోపురం పక్కనే ఉండేది. భక్తుల ప్రవేశించినపుడు ఇది కనబడేది కాదు. దాంతో వెతుక్కునే వారు. దానిని మార్పు చేసారు. ఈ కౌంటర్‌ను ప్రస్తుతం ప్రత్యేక దర్శనం టిక్కెట్లు విక్రయిస్తున్న పరిపాలనా భవనానికి సమీపంలో ఏర్పాటు చేసారు. ఇక్కడే ప్రత్యేక దర్శనం టిక్కెట్లుతో పాటు 17 సేవలకు సంబంధించిన టిక్కెట్లును కకూడా జారి చేసేలా ఏర్పాటు చేసారు. అంతేకాక ఇక్కడ సేవాల వివరాలు, రుసుములతో పాటు సంప్రదాయాలకు సంబందించి పెద్ద పీట వేసారు. అంతేకాక అన్ని సేవలకు సంబంధించిన టిక్కెట్లును అన్ని కౌంటర్లలో జారి చేసేలా అనుసంధానం చేసారు. అయితే ఇక్కడ భక్తుల రద్దీని కంట్రోల్ చేయటానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

**బిక్షాల గాలిగోపురం వద్ద కౌంటర్ ఏర్పాటు చేయాలి:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి విఐపిలు, వివిఐపిలు, కార్లు, టూరిజం బస్సులు, టూరిస్టు బస్సుల్లోవ చ్చే భక్తులు నాల్గవ గేట్ నుంచి ప్రవేశిస్తారు. బస్సుల్లో వచ్చే భక్తులు పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. బస్సుల్లో తమిళనాడు, కర్నాటక, ఉమ్మడి తెలుగురాష్ట్రాల నుంచి వచ్చేభక్తుల మాటేమన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం బిక్షాల గాలిగోపురం వద్ద ప్రసాదాల విక్రయ కౌంటర్లలో కూడా అనుమతిస్తే అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సేవల టిక్కెట్లు కొనుగోలుకు సంబంధించి నాలుగు కౌంటర్లు ఉన్నాయి. ఆలయాధికారులు మాత్రం అన్ని కౌంటర్లలో లాగ్ఇన్ చేసినట్లు సమాచారం.

## లియాఫీ నూతన కార్యవర్గం ఎన్నిక



తిరుపతి విద్య, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త : సి.బి2 ఎల్ఐసి బ్రాంచ్‌లో లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో బ్రాంచ్ కొత్త కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.శ్రీనివాసులు, కార్యదర్శిగా కె.వెంకటమునిని, ట్రెజరర్‌గా టి.ఆనందయ్యను, నెల్లూరు డివిజన్ వైస్ ప్రెసిడెంట్‌గా జి.వి.రమణయ్యను, డివిజన్ ఇసి మెంబర్‌గా వై.శివారెడ్డిని ఎన్నుకు న్నారు. సమావేశానికి డివిజన్ ప్రెసిడెంట్ సుబ్బారావు (చీరాల), డివిజన్ సెక్రటరీ సతీష్‌బాబు (శ్రీకాళహస్తి), చిత్తూరు జిల్లా సెక్రటరీ రుద్రిమోహన్ (పుత్తూరు), వీరాస్వామి, నాయుడుపేట, మధు సూదన్‌రెడ్డి (పీలేరు), శ్రీనివాసులురెడ్డి, షణ్ముగరావు, శ్రీధర్‌రెడ్డి, సిబిటు నెల్లూరు శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, పీలేరు బ్రాంచ్‌ల ప్రెసిడెంట్, సెక్రటరీలు హాజరయ్యారు. లియాఫీ పటిష్టతకు మరింత కృషి చేయాలని, ఏజెంట్స్ అభ్యున్నతికి కృషిచేయాలని ప్రతిపాదించారు.

## అంతర్జాతీయ వ్యాపారాల అభివృద్ధికి ప్రతి వ్యాపారవేత్త సహకరించాలి



తిరుపతిరూరల్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త: పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో అంతర్జాతీయ స్థాయిలో వ్యాపార అభివృద్ధి చెందే అవకాశం ఉందని, ప్రతి వ్యాపారవేత్త సహకరించాలని బిఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెవిపి రమేష్ అన్నారు. బిఎన్ఐ ఆధ్వర్యంలో అతిపెద్ద వ్యాపార వేత్తల సమ్మేళనం ఆదివారం మంగళంలోని ఆశా కన్వెన్షన్‌హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో కెవిపి రమేష్ మాట్లాడుతూ తిరుపతిలోని గ్లోబల్ లెవల్ బిజినెస్ సెంటర్‌గా మార్చడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని కొనియాడారు. ఒకే వేదికపైన అన్ని రంగాలకు చెందిన వ్యాపారవేత్తలు కలవడం గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఈ సమావేశానికి సౌత్ ఇండియాలోని బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, వైజాగ్ నగరాల నుంచి 750 మంది విచ్చేసి వారి వ్యాపారాలు గురించి వివరించడంతో పాటు వ్యాపారాల అభివృద్ధి గురించి తెలుసుకున్నారు. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అందజేసి, వ్యాపారవేత్తలు నష్టపోకుండా అందుబాటులో ఉన్న ధరలకు వస్తువులు విక్రయించాలని కెవిపి రమేష్ కోరారు. వ్యాపారాలు చేసి లక్షలు కోట్లు సంపాదించాలని దుర్బిద్ధితో వ్యాపార రంగంలో ఎవరు అడుగు పెట్టరాదని, వినియోగదారుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ సరసమైన ధరలకు వ్యాపారాలు చేయాలని సూచించారు. భారతదేశం అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిచేందుకు వ్యాపారవేత్తలు కృషి చేయాలన్నారు. దేశంలో ఎన్నో వ్యాపారాలలో వున్న ప్రజలు మాత్రం విదేశిమోజులోపడి...మన వ్యాపారాలను నిర్లక్ష్యం చేస్తున్నారని, భారత్ తయారు చేసే వస్తువులకు, మార్కెట్‌లో కొనుగోలు సామర్థ్యం పెంచాలన్నారు. దేశంలో, రాష్ట్ర ప్రభుత్వాలలో భారతదేశం తయారు చేసే వస్తువులకు ప్రకటన ఖర్చులు తగ్గించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎన్ఐ కన్సల్టెన్సీ చైర్మెన్ సాయికిరణ్, ఈడి సంతోష్, కార్యక్రమ నిర్వాహకులు వంశీకృష్ణ, డిఎన్ఐ సభ్యులు పాల్గొన్నారు.

**డివిసత్రంలో వరుస చోరీలు...**

## చేధించడంలో విఫలమౌతున్న పోలీసులు!

దొరవారిసత్రం, సెప్టెంబరు 29 ప్రభాతవార్త : దొరవారిసత్రం మండలంలో దొంగలు వరుస చోరీలకు పాల్పడుతున్నా చేధించడంలో పోలీసులు విఫలమౌతున్నారన్న విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ఈనెల 10న పూలతోటకు చెందిన ఆనంధనాయుడు వ్యవసాయ మోటార్లు, సోలార్ మిషన్, బ్యాటరీలు చోరీలకు గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే విధంగా జూలై 5న టపాయిండ్లు వద్ద చిల్లరదుకాణంలో ఉన్న నర్రా నీలాంబిక అనే మహిళమెడలో మూడుసవర్ల బంగారుచైన్‌ను గుర్తుతెలియని దుండగులు పట్టపగలే అపహరించుకొని వెళ్లారు. దొరవారిసత్రం- కొత్తపల్లి- పూలతోటలో మోటార్‌సైకిల్ చోరీలకు గురైనట్లు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల వడ్డికండ్రిగ గ్రామానికి చెందిన మల్లి మురళికి చెందిన సోలార్ మిషన్ల బ్యాటరీలు చోరీలకు గురైనట్లు వాపోయాడు. మార్చి నెలలో కొత్తపల్లిలో వరికోత యంత్రాలలో గుర్తుతెలియని వ్యక్తులు డీజల్ చోరీకి పాల్పడినట్లు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే విధంగా సెల్‌పోన్ టవర్లులో వరుసగా డీజల్-బ్యాటరీలు చోరీలకు గురౌతున్నట్లు యాజమాన్యం ఆరాతీస్తుంది. గతంలో 2017-2018 సంవత్సరంలో నాయుడుపేట-దొరవారిసత్రం మండలాల పరిధిలో ఎయిటెల్, బిఎస్ఎన్ఎల్, ఐడియా, సెల్‌పోన్ టవర్లులో డీజల్-బ్యాటరీలు చోరీలుచేసి పోలీసులకు పట్టుబడి జైలుకుపోయిన ముఠాపై భాదితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈముఠా గతంలో జరిగిన అనేక చోరీల్లో నిందితులుగా పట్టుబడి ఉన్నారు. ఈముఠా సెల్‌పోన్ టవర్‌లోనే కాకుండా ఇంట్లో ఎవరులేని సమయంలో ఇంటి తాళాలు పగలుగొట్టి నగదు, బంగారు చోరీచేయడం, వ్యవసాయ మోటార్లు, సోలార్ మిషన్లు-బ్యాటరీలు చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులు సెల్‌పోన్ టవర్లులో డీజల్- బ్యాటరీలు, దారిదోపిడికి పాల్పడుతున్న ముఠాను అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారిస్తే అసలు విషయాలు బయటపడే అవకాశం ఉందని భాదితులు కోరుతున్నారు.

## రూ.కోటి విరాళంను సిఎంకి అందించిన జివిఆర్ సంస్థ



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త సూళ్లూరుపేటకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, జీవీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధినేత కొండేపాటి గంగాప్రసాద్ విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు కోటి రూపాయల సహాయాన్ని చెక్కు రూపంలో శనివారం రాత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి అందజేశారు. సంస్థకు చెందిన రాజుతో కలిసి ఆయన ఈ సహాయాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

## 'టెట్'కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

కోట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త : జిల్లాలో అక్టోబరు 3 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆమేరకు కోట మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టిలో టెట్‌కు సంబందించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఇఒ డి.మస్తానయ్య తెలిపారు. ఆయన ఆదివారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ ఇందుకు ప్రత్యేక అధికారులు, స్క్వాడ్ బృందాలును నియమించారని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఫోటో లేని హాల్ టికెట్లతో వచ్చే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల వద్ద ఫోటోతో కూడిన గుర్తింపు పత్రం తాజా ఫోటోను పరిశీలించి అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. రోజుకు 120 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.

## హత్య కేసులో నిందితుడు అరెస్టు



గూడూరు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త : మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్టు అయిన సంఘటన శనివారం గూడూరు రూరల్ పరిధిలోని తిప్పవరప్పాడు గ్రామంలో చోటు చేసుకుంది. గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా గ్రామీణ సిఐ కిషోర్ బాబు మాట్లాడుతూ ఇటీవల గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు బిసి కాలనీ ప్రాంతంలో ఉండే ఆనందమ్మ అనే మహిళలతో నిందితుడు రమేష్ సహజీవనం చేస్తుండే వాడన్నారు. ఇటీవల మనస్పర్ధల కారణంగా మహిళను కర్రతో దారుణంగా కొట్టడంతో చనిపోయిందన్నారు. మహిళ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసారన్నారు. నిందితుడు పరారు కావడంతో శనివారం ఉదయం గూడూరు రూరల్ పరిధిలో తిప్పవరప్పాడు కూడలి వద్ద నిందితుడును అరెస్టు చేయడం జరిగిందన్నారు. అనంతరం రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బందిని అభినందించారు.

## జాతీయ దివ్యాంగుల క్రికెట్ జట్టుకు ఎంపికైన నరేష్



వెదురుకుప్పం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త : జాతీయ దివ్యాంగుల క్రికెట్ జట్టుకు మండలంలోని కొరగుంటకు చెందిన టి.నరేష్ ఎంపిక కావడంతో ఆదివారం రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి నేసనూరు మునిచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మునిచంద్రా రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయి దివ్యాంగుల క్రికెట్ జట్టుకు ఎంపిక రావడం అభినందనీయమన్నారు. క్రికెట్‌లో బాగా రాణించి మంచి గుర్తుంపు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జీ కోనేరు చంగల్‌రాయ రెడ్డి, పచ్చికాపల్లంబూత్ కన్వనర్ జయరాం రెడ్డి, నాయకులు పుత్తూరు ధర్మా రెడ్డి, పుత్తూరు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పద్మభూషణ్ రాజాశ్రీ బిర్లాజి జన్మదిన వేడుకలు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త: స్థానిక గాంధీ రోడ్‌లోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి రాయులు అధ్యక్షతన ఆధ్వర్యంలో పద్మభూషణ్ రాజా శ్రీ బిర్లాజి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజెపి నాయకులు జి భానుప్రకాష్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది అండ్ బిజెపి నాయకులు అజయ్ కుమార్, జల్లి మధుసూదన్, సామంచి శ్రీనివాసులు హాజరయ్యారు. మొదటగా కేక్ కట్ చేసి అనంతరం పేద ప్రజలకు 1000 మందికి అన్నదానం వితరణ చేసారు. కస్తూర్బా గాంధీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ పి.సి రాయులు మాట్లాడుతూ ప్రపంచంలోని 39 దేశాలలో బిర్లా వారి కంపెనీలు ఉన్నాయని, లక్షలాది మంది ఈ కార్యక్రమంలో బండి మధుసూదన్ రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, ఉమా, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొత్త గొల్లపల్లెలో అదుపులో అతిసార

తవణంపల్లె, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త: మండలంలోని నల్లిశెట్టిపల్లె గ్రామపంచాయతీ కొత్తగొల్లపల్లెలో అతిసార అదుపులోకి రావడంతో గ్రామస్తులు, మండల వైద్యఆరోగ్యశాఖాధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామంలో కలుషిత తాగునీరు సేవించడం వల్ల మంగళవారం నుండి శనివారం వరకు సమారు 27 మందికి పైగా అతిసార వ్యాధి సోకి వాంతులు, విరేచనాలు కావడంతో వివిధ ఆస్పతుల్లో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు మంగళవారం ఐదు మందికి అతిసార సోకగా బుధవారం మరో పదిమంది వరకు ఈవ్యాధి సోకింది. అలాగే గురువారం కూడా ఈవ్యాధితో ఎనిమిది మంది ఆస్పత్రి పాలయ్యారు. అలాగే శుక్ర, శనివారాల్లో మరో ఐదు మందికి అతిసార సోకడంతో ఆస్పత్రిలో వైద్యసిబ్బంది వైద్య చికిత్సలు అందిస్తున్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకు ద్వారా సరఫరా అయ్యే తాగునీరు కలుషితం కావడం వల్లనే అతిసార వ్యాధి ప్రబలినట్లు గుర్తించిన అధికారులు గ్రామంలోని రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకును క్లోరినేషన్ చేయడంతో పాటు ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. అలాగే మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక ఆధ్వర ్యంలో మంగళవారం నుండి గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు చికిత్సలు అందిస్తున్నారు. దీనితో ఎట్టకేలకు ఆదివారం కొత్తగొల్లపల్లెలో అతిసార వ్యాధి అదుపులోకి వచ్చింది. గ్రామంలో వైద్యసిబ్బంది ప్రత్యేక వైద్యశిబిరాలను కొనసాగిస్తున్నా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత గురించి గ్రామస్థులకు అవగాహన కల్పిస్తుండడంతో ఆదివారం ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. దీనితో గ్రామస్థులు, వైద్యాధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

## స్టార్ ఆఫ్ ఇండియాగా నగరికి చెందిన తేజేష్

**జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ విజేతగా రాష్ట్ర బాలుర జట్టు-రెండో స్థానంలో బాలికల జట్టు**





నగరి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త: హర్యానా రాష్ట్రం రోహితక్ సైనిక్ స్కూలులో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్ర జట్టు విజయం సాధించి గోల్డ్ మెడల్ సాధించిందని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసనియేషన్ కార్యదర్శి బాలాజీ తెలిపారు. బాలికల జట్టు రెండో స్థానం సాధించింది. దీంతో పాటు డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీల్లోను రాష్ట్ర జట్టు విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. 14 రాష్ట్రాలు పాల్గొన్న ఈ పోటీల్లో ప్రతి జట్టు విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. 14 రాష్ట్రాలు పాల్గొన్న ఈ పోటీల్లో ప్రతి మ్యాచ్ ఆసక్తికరంగా సాగిందన్నారు. ఫైనల్‌లో ఆంధ్ర, తమిలనాడు జట్లకు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో రాష్ట్ర జట్టు విజేతగా నిలిచిందన్నారు. రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా సారథ్యం వహించిన నగరి పట్టణానికి చెందిన కె.సి.తేజేష్ అన్ని పోటీల్లోను ఉత్తమ ప్రతిభ కనబరచి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును అందుకున్నాడన్నారు. స్టార్ ఆఫ్ ఇండియాకు విజేతగాను, రన్నర్‌గాను నిలిచిన జట్టు క్రీడాకారులకు రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు విజయశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరావ్, టీం మేనేజర్ సూరిబాబు, కోచ్ రాజు, జిల్లా అసోసియేషన్ చైర్మన్ జగన్నాథంనాయుడు, అధ్యక్షులు వెంకటస్వామి, నగరి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ రవిబాబు, అధ్యక్షులు మోహన్, కార్యదర్శి నిజాముద్దీన్ కోచ్‌లు, టి.గోపి, జయచంద్ర, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## గుంతలమయమైన రోడ్డుతో తప్పని తిప్పలు



విజయపురం, సెప్టెంబరు 29 ప్రభాతవార్త: మండలంలోని తిరుత్తణి-నాగలాపురం రోడ్డు నుంచి ముత్యాలరెడ్డి కండ్రిగ, మంగళం చెరువు కట్ట మీదుగా విజయపురంకు వెళ్లే రోడ్డు అడుగడుగునా గుంతలమయం కావడంతో వాహన చోదకులకు తిప్పలు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తారు రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వర్షపునీరు నిలిచి ప్రమాదకరంగా మారింది. విజయపురం మండల కేంద్రానికి నగరి నుంచి బస్సులో ప్రయాణించే మార్గంలో వెళ్ళడానికి సుమారు 26 కి.మీ ఉంది. కానీ నగరి నుంచి కాళికాపురం, ముత్యాలరెడ్డి కండ్రిగలమీదుగా ప్రయాణం చేస్తే 16 కి.మీ దూరం ఉండడం వలన ఎక్కువ మంది మండల కేంద్రానికి చేరుకోవడానికి ఆ మార్గంలో ప్రయాణం చేస్తూ ఉంటారు. కానీ రోడ్డు సుమారు 4 కి.మీ దూరం పూర్తిగా రోడ్డు ధ్వంసం కావడంతో ప్రయాణం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**న గత ప్రభుత్వంలో మరమ్మతులకు నోచుకోలేదు:**

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. ఐదేళ్ళ కాలంలో మరమ్మతు చర్యలు నిర్వహించక పోవడంతో రోడ్డు అధ్వానంగా తయారైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని మంగళం పంచాయతీకి చెందిన స్వర్గీయ చిలకం రామచంద్రారెడ్డి ఉమ్మడి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తిరుత్తణి-నాగలాపురం రోడ్డు నుంచి ముత్యాలరెడ్డి కండ్రిగ మీదుగా విజయపురానికి తారు రోడ్డు మంజూరు చేశారు. అనంతరం మాజీ మంత్రి చెంగారెడ్డి ఒక పర్యాయం మరమ్మతు చర్యలు నిర్వహించారు. ఇకనైనా పాలకులు, అధికారులు రోడ్డు మరమ్మతు చర్యలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అరణ్యంలో పందెంరాయుళ్లు 18 మంది అరెస్టు



గంగవరం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త : గుట్టు చప్పుడు కాకుండా అరణ్యంలో నిర్వహిస్తున్న కోడి పందాలు స్థావరాలపై గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్ దాడి చేసి 18 మందిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. సిఐ కథనం మేరకు వివరాలిలా..ఆదివారం మండలంలోని మేలుమాయి పంచాయతీ కొత్తూరు అటవీ ప్రాంతంలో తరచు కోడి పందాలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో అందిన సమాచారం మేరకు సిఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి దాడులు చేయగా మండలంలోని సామలగడ్డకు చెందిన మారప్ప(45)తో పాటు 17 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 19 పందెం కోళ్ళను, 11 ద్విచక్రవాహనాలను, రూ. 24000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అర్బన్ సిఐ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా ఎక్కడైనా కోడి పందాలు, ప్యాకాట వంటి అసాంఘీక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘనంగా వీడ్కోలు



రేణిగుంట, సెప్టెంబరు 29 ప్రభాతవార్త: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డా. ధనంజయ, వై.చంద్రచూడ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం ఘనంగా వీడ్కోలు లభించింది. తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం నుంచి బయలుదేరిన ఆయనకు విమానాశ్రయంలో ఆంధ్రప్రదేశ్ హై కోర్టు జడ్జి చిత్తూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కృష్ణమోహన్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్టర్ జనరల్, వై.లక్ష్మణరావు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్టార్ ప్రోటోకాల్ రాఘవస్వామి, హై కోర్టు మేనేజ్‌మెంట్ రిజిస్టార్ రామకృష్ణ, చిత్తూరు ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి భీమారావు, చీఫ్ ప్రోటోకాల్ ఆఫీసర్ గురునాథ్, తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ప్రోటోకాల్ మెజిస్ట్రేట్ కోటేశ్వరరావు, ప్రోటోకాల్ సూపరింటెండెంట్ ధనంజయలునాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, రేణిగుంట తహసీల్దార్ సురేష్ బాబు తదితరులు వీడ్కోలు పలికారు.

## ప్రధాని మన్‌కీ బాత్ అందరికీ దోహదం



ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీబాత్‌లో తెలియజేసే అంశాలు అన్ని వర్గాలకు ఉపయోగపడేలా ఉంటాయని బిజెపి నేత గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. ఆదివారం మన్‌కీ బాత్‌ను వీళ్ళు తిరుపతిలో వీక్షించారు.

ప్రభాతవార్త-తిరుపతి

## 'శ్రీకళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు

**-ఉత్సవాల నిర్వాహణపై కమిటీ సభ్యులతో చెవిరెడ్డి సమీక్ష**



తిరుపతిరూరల్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త: తుమ్మలగుంట శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. అక్టోబర్ 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు జరుగుతున్న ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ సభ్యులతో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదివారం సమీక్ష నిర్వహించారు. తిరుమల తరహాలో స్వామివారి భక్తులకు ఏలాంటి లోటు లేకుండా ఉత్సవాల నిర్వాహణ చేపట్టాలన్నారు. ఈ ఉత్సవాలలో ఎవ్వరేవ్వరు ఏఏ పనులు పూర్తి చేయాలన్న బాధ్యతలను కమిటీలకు అప్పగించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంతో పాటు గ్రామంలో చేపట్టాల్సిన పుష్పాల అలంకరణ, విద్యుత్ దీపాలు, బ్యారికేడ్లు ఏర్పాటు వంటి పనులతో పాటు పారిశుధ్య పనులు లోపించకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తుమ్మలగుంట శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు అందరికి ఆహ్వానం పలికేలా స్వాగత తోరణాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు త్రాగునీరు, అన్న ప్రసాదాలు పంపిణికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే వాహన సేవల ముందు ప్రదర్శనలు చేసే కళాకారులతో పాటు స్వామివారి వాహనం మోసేవారికి రుచికరమైన విందు భోజనం అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

**దేదీప్యమానంగా విద్యుత్ వెలుగులు**

శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో విద్యుత్ కటౌట్లు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తుమ్మలగుంట గ్రామం మొత్తం విద్యుత్ వెలుగులు మధ్య విరాజిల్లుతోంది. స్వావివారి ప్రధాన రహదారి స్వామివారి వాహనం ఊరేగే అన్ని విధులలో రంగు రంగుల విద్యుత్ దీపాలు విరాజిల్లు తున్నాయి.


వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, DUDDUKURU SAI SATHVIKA Wife of DUDDUKURU VEERA SAI HARSHA born on 01-08-1997 residing at 20-3-124/a2, Akkarampalli Road, Near SBI Bank, Tirupati 517501, have changed my name to VEMANA SAI SATHVIKA vide affidavit dated 26-09-2024 at Tirupati.
(Ro.No.25760)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.